PRGI No : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

## చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

చీఫ్ ఎడిటర్ : పస్తం సైదులు, సంపుటి : 03 సంచిక - 324 పేజీలు - 08 ఆదివారం 18 అక్టోబర్ 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

## వయసు ఆధారిత ఆంక్షలు వద్దు




పిల్లల భద్రత, ఇంటర్నెట్ స్వేచ్ఛ రెండూ ముఖ్యమే: సుప్రీంకోర్టు

ఆన్‌లైన్ వేధింపుల నివారణకు కఠిన నిబంధనలు అమలు చేయాలి

## రష్యా చమురుపై ఆంక్షలు ఎత్తివేసిన ట్రంప్




- భారత్, చైనాలకు ఊరట..

ఉక్రెయిన్ తీవ్ర ఆగ్రహం



## బంగ్లాదేశ్ రిసార్టులో ఘోర అగ్నిప్రమాదం

- 10 మంది మృతి.. 9 మందికి గాయాలు
- మరికొందరి ఆచూకీ గల్లంతు

**తొలి అక్షరం/ఢాకా,అక్టోబర్ 17:**బంగ్లాదేశ్‌లోని ప్ర ముఖ పర్యాటక ప్రాంతం కాక్స్ బజార్‌లో ఘోర అగ్నిప్ర మా దం చోటుచేసుకుంది. ఇనానీ ప్రాంతంలోని పటువార్టెక్ బీచ్ సమీపంలో ఉన్న ఓ సముద్రతీర విడిది కేంద్రంలో శనివారం తెల్లవారుజామున మంటలు చెలరేగడంతో 10 మంది

మిగతా2లో...

## రైతుల భూమికి భరోసా.. సాగునీటి ప్రాజెక్టుకు కొత్త ప్రతిపాదనలు!

● సీఎం రేవంత్‌రెడ్డితో మంత్రి తుమ్మల భేటీ ● పైపుల కాలువలతో 9,767 ఎకరాల భూమి ఆదా.. రూ.2,148 కోట్ల వ్యయం తగ్గించే అవకాశం



**తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 17:** రైతుల భూములను కాపాడటంతో పాటు సాగునీటి ప్రాజెక్టుల వ్యయాన్ని తగ్గించడం, ఆయిల్‌పామ్ తోటల్లో విద్యుత్తు ప్రమాదాలను నివారించడం లక్ష్యంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక ప్రతిపాదనలు చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పలు లేఖలు అందజేసి, సీతారామ ఎత్తిపోతల పథకంలో సాధ్యమైన ప్రాంతాల్లో పైపుల ద్వారా నీటిని సరఫరా చేయాలని కోరారు. **రూ.2,148 కోట్ల వరకు** ఆదాసీతారామ ప్రాజెక్టు పంపిణీ కాలువలను పైపుల వ్యవస్థగా మార్చితే సుమారు 9,767 ఎకరాల భూమి ఆదా కావడంతో పాటు భూసేకరణ వ్యయంలో

మిగతా2లో...



## విద్యార్థినులపై పోలీసుల దౌర్జన్యం సిగ్గుచేటు

- ప్రశ్నించే గొంతులను అణచివేసే కుట్ర జరుగుతోంది: రాహుల్ గాంధీ

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,అక్టోబర్ 17:** ప్రజాస్వామ్యం కోసం గొంతెత్తిన విద్యార్థినులపై ఢిల్లీ పోలీసులు దౌర్జన్యానికి పాల్పడటం సిగ్గుచేటని లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ విమర్శించారు. విద్యార్థులను

మిగతా2లో...

## నీరు, విద్యుత్ పొదుపుగా వినియోగించాలి

● ఎల్‌నినో ప్రభావంతో మారుతున్న వాతావరణ పరిస్థితులు ● రాష్ట్రంలో విద్యుత్ అవసరం 20 వేల మెగావాట్లు: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 17:** ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో నీటిని, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రజలకు పిలుపునిచ్చారు. మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ నీరు, విద్యుత్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అవసరమైన మేరకే వనరులను వినియోగిస్తూ వృథాను అరికట్టాలని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన బతుకమ్మ యువ చిత్ర నిర్మాతల పురస్కారాల ప్రదానోత్సవంలో భట్టి విక్రమార్క పాల్గొని విజేతలకు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన

మిగతా2లో...

## గోదావరి - కావేరి అనుసంధానం ముసుగులో మరో కుట్ర!

తెలంగాణ జల హక్కులకు ముప్పు కలిగించే ప్రయత్నాలు: హరీశ్‌రావు ఆందోళన

**తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 17:** గోదావరికావేరి నదుల అనుసంధాన ప్రాజెక్టు పేరుతో తెలంగాణ నీటి ప్రయోజనాలకు నష్టం కలిగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాజెక్టు మార్గాన్ని పోలవరం వైపు మళ్లించే ప్రయత్నం చేస్తోందని

మిగతా2లో...




## ప్రకృతి ఆరాధనే బతుకమ్మ

- తెలంగాణ సంస్కృతికి బతుకమ్మ ప్రతీక: సీఎం రేవంత్‌రెడ్డి



**తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 17:** తెలంగాణ ఆడపడుచులకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను పూజించే బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఆడపడుచులంతా బతుకమ్మ వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని సీఎం ఆకాంక్షించారు. తెలంగాణ అస్తిత్వాన్ని

మిగతా2లో...

## పర్యాటక కేంద్రంగా ఎల్లమ్మ చెరువు

హుస్నాబాద్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

గాజు వంతెన, గుట్టను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దుతాం: మంత్రి పొన్నం ప్రభాకర్




## క్లిష్ట పరిస్థితుల్లో బీజేపీకి విదేశీ నినాదమే ఆధారం!

- మోదీ పాలనలో ఏ వర్గానికీ న్యాయం జరగలేదు: పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్



# వయసు ఆధారిత ఆంక్షలు వద్దు

**తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 17:** ఇంటర్నెట్ వినియోగించుకునే హక్కు పెద్దలతో పాటు పిల్లలకూ ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వయసును ప్రాతిపదికగా తీసుకుని ఇంటర్నెట్ వినియోగంపై పూర్తిస్థాయి ఆంక్షలు విధించడం సమంజసం కాదని పేర్కొంది. ఇలాంటి పరిమితుల వల్ల పిల్లలు రహస్యంగా ఇంటర్నెట్‌ను వినియోగించే ప్రమాదం ఉందని, ఆన్‌లైన్‌లో వేధింపులు లేదా బెదిరింపులు ఎదురైనా తల్లిదండ్రులకు చెప్పేందుకు వెనుకాడే అవకాశం ఉందని అభిప్రాయపడింది.జస్టిస్ జె.బి. పార్థీవాలా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఇంటర్నెట్ సృజనాత్మక వ్యక్తీకరణకు, సమాచార మార్పిడికి, విద్యాభ్యాసానికి ఉపయోగపడుతుందని పేర్కొంది. ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లోని పిల్లలకు, ప్రత్యేక అవసరాలు ఉన్న చిన్నారులకు ఆన్‌లైన్ వేదికలు ఎంతో సహాయపడుతున్నాయని తెలిపింది. అదే సమయంలో పిల్లలను ఆన్‌లైన్ లైంగిక వేధింపుల నుంచి రక్షించాల్సిన అవసరాన్ని ధర్మాసనం గుర్తుచేసింది. హానికరమైన సమాచారాన్ని గుర్తించి తొలగించడంలో సామాజిక మాధ్యమ వేదికలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించింది. పిల్లల ఖాతాల భద్రత కోసం ప్రత్యేకంగా 'బాలల భద్రతా విధానం' ప్రవేశపెట్టడం మంచిదని అభిప్రాయ పడింది. చిన్నారులకు ఇంటర్నెట్ సదుపాయాన్ని పూర్తిగా నిరాకరించడం కాకుండా, వారి భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని కేంద్రానికి సూచించింది. సురక్షితమైన డిజిటల్ వాతావరణం కల్పించేందుకు సామాజిక మాధ్యమాల్లో లైంగిక వేధింపులకు సంబంధించిన సమాచారాన్ని తొలగించేలా కఠిన నిబంధనలు అమలు చేయాలని పేర్కొంది.

# పర్యాటక కేంద్రంగా ఎల్లమ్మ చెరువు

**తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 17:** హుస్నాబాద్ పట్టణంలోని చారిత్రక ఎల్లమ్మ చెరువును ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. చెరువుతో పాటు గాజు వంతెన, సమీపంలోని గుట్టను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ఎల్లమ్మ చెరువు వద్ద చేపట్టిన సుందరీకరణ పనులు, పండుగ ఏర్పాట్లను మంత్రి అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. పండుగకు వచ్చే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.హుస్నాబాద్ నియోజకవర్గాన్ని పర్యాటకం, విద్య, వైద్యం, క్రీడలు, రహదారులు, సాగునీటి రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. పట్టణానికి కబడ్డీ అకాడమీతో పాటు ఈత కొలను కూడా మంజూరైనట్లు చెప్పారు.2007లో శంకుస్థాపన చేసిన గౌరవెల్లి ప్రాజెక్టుకు సంబంధించిన అడ్డంకులు తొలగిపోయాయని, ప్రస్తుతం కాలువల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ జరుగుతోందని వివరించారు. ప్రాజెక్టు పనులను ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు కొనసాగుతున్నాయని మంత్రి వెల్లడించారు.ఎల్లమ్మ చెరువు అభివృద్ధితో హుస్నాబాద్ ప్రాంతానికి పర్యాటకంగా మరింత గుర్తింపు రావడంతో పాటు స్థానికంగా ఉపాధి, వ్యాపార అవకాశాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**ఆరోగ్యంపై దృష్టి సారించాలి.. క్రీడలను జీవితంలో భాగం చేసుకోవాలి: మంత్రి శ్రీధర్‌బాబు**

**వరంగల్‌ను పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తాం.. త్వరలో విమానాశ్రయం, హనుమకొండలో ఐటీ టవర్**




**తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 17:** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. వ్యాయామం, క్రీడలు, ధ్యానం ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతను పొందవచ్చని తెలిపారు.నాయిని విశాల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రై సిటీస్ హాఫ్ మారథాన్ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. జాతీయ సాంకేతిక విద్యాసంస్థ నుంచి హయగ్రీవాచారి మైదానం వరకు జరిగిన ఈ పరుగులో 5, 10, 21 కిలోమీటర్ల విభాగాలను ఏర్పాటు చేశారు. యువతలో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు క్రీడాస్ఫూర్తిని ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని మంత్రి పేర్కొన్నారు.హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా వరంగల్ నిలుస్తోందని శ్రీధర్‌బాబు అన్నారు. వరంగల్‌ను పారిశ్రామికంగా అభివృద్ధి చేసి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. త్వరలో వరంగల్ విమానాశ్రయాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని, హనుమకొండలో ఐటీ టవర్ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడా ప్రతిభను గుర్తించి, యువతకు తగిన అవకాశాలు కల్పించడం ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహించాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల భూమికి భరోసా.. సాగునీటి ప్రాజెక్టుకు కొత్త ప్రతిపాదనలు!

(మొదటి పేజీ తరువాయి)

రూ.2,148.74 కోట్ల వరకు తగ్గింపు సాధ్యమవుతుందని మంత్రి అంచనా వివరించారు. ఈ పథకం ద్వారా మొత్తం 6.74 లక్షల ఎకరాలకు సాగునీటి ప్రయోజనం కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. భూముల సేకరణతో రైతులకు ఇబ్బందులు కలగకుండా, పనులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.**ఆయిల్‌పామ్ తోటల్లో విద్యుత్తు ప్రమాదాల నివారణ**ఆయిల్‌పామ్ చెట్ల ఆకులు, కొమ్మలు విద్యుత్తు తీగలకు తగలడం వల్ల సరఫరాలో అంతరాయాలు, ప్రమాదాలు ఏర్పడుతున్నాయని మంత్రి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. 11 కేవీ విద్యుత్తు లైన్లకు కవర్డ్ కండక్టర్లు, అవసరమైన చోట తక్కువ వోల్టేజీ లైన్లకు ప్రత్యేక కేబుళ్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. కొత్త, పాత తోటల్లో దశలవారీగా మార్పులు చేపట్టేందుకు రాష్ట్రస్థాయి ఉమ్మడి విధానం రూపొందించాలని కోరారు.**దుమ్ముగూడెం వద్ద నీటి నిల్వకు చర్యలు**దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద ఇసుక బస్తాలతో తాత్కాలికంగా నీటిని నిల్వ చేసి సుమారు ఒక టీఎంసీ నీటిని వినియోగించుకునే అవకాశాన్ని మంత్రి వివరించారు. సుమారు రూ.30 లక్షల వ్యయంతో ఈ పనులు చేపట్టవచ్చని తెలిపారు. దీనివల్ల సాగు, తాగునీటి అవసరాలకు ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ పనులను వెంటనే ప్రారంభించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు వెల్లడించారు. **ఖమ్మం అభివృద్ధికి నిధులు కోరిన మంత్రి**ఖమ్మం నగరంలో భూగర్భ మురుగునీటి వ్యవస్థ, తాగునీటి పథకాలకు సంబంధించిన నివేదికలను ఆమోదించి నిధులు విడుదల చేయాలని మంత్రి కోరారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే యాతాలకుంట టన్నెల్ పనులను త్వరగా పూర్తి చేసి సత్తుపల్లి, వేంసూరు, అశ్వారావుపేట, దమ్మపేట ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించాలని కోరారు.

## నీరు, విద్యుత్ పొదుపుగా వినియోగించాలి

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ, గతంలో అక్టోబర్, నవంబర్ నెలల్లో చలి తీవ్రంగా ఉండేదని, ప్రస్తుతం అందుకు భిన్నంగా వాతావరణ పరిస్థితులు మారుతున్నాయని తెలిపారు. ఒకప్పుడు చలి నుంచి రక్షించుకునేందుకు జాగ్రత్తలు తీసుకునేవారని, ప్రస్తుతం వేడి నుంచి కాపాడుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు.వాతావరణంలో వస్తున్న మార్పులు ప్రజల జీవన విధానంపై ప్రభావం చూపుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఇలాంటి పరిస్థితుల్లో నీరు, విద్యుత్ వంటి కీలక వనరులను బాధ్యతాయుతంగా వినియోగించడం అవసరమని తెలిపారు.రాష్ట్రంలో ప్రస్తుతం విద్యుత్ అవసరం 20 వేల మెగావాటాలకు చేరిందని భట్టి విక్రమార్క వెల్లడించారు. పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు విద్యుత్‌ను అనవసరంగా వినియోగించకుండా పొదుపు చర్యలు పాటించాలని సూచించారు. నీటిని కూడా వృథా చేయకుండా భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని వినియోగించాలని పిలుపునిచ్చారు.

## క్లిష్ట పరిస్థితుల్లో బీజేపీకి విదేశీ నినాదమే ఆధారం!

**తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 17:** క్లిష్ట పరిస్థితులు ఎదురైనప్పుడల్లా విదేశీ అంశాలను తెరపైకి తీసుకురావడం బీజేపీకి అలవాటుగా మారిందని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. గత పదమూడేళ్లుగా ఇదే ధోరణి కొనసాగుతోందని, ప్రస్తుతం బంగ్లాదేశ్ అంశాన్ని కూడా అదే విధంగా ప్రస్తావిస్తున్నారని ఆరోపించారు.శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ వృత్తి నిపుణుల విభాగం అధ్యక్షుడు మధు యాష్కీలతో కలిసి మహేశ్‌కుమార్ గౌడ్ విలేకరులతో మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనలో దేశంలోని ఏ వర్గానికీ న్యాయం జరగలేదని ఆయన విమర్శించారు. దేశభక్తి గురించి మాట్లాడే బీజేపీ నాయకులు భారత భూభాగంలోకి చైనా చొచ్చుకొచ్చినప్పుడు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.**ఎన్నికల సంఘంపై విమర్శలు** ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా జ్ఞానేశ్‌కుమార్ నియామకం కోసం కేంద్ర ప్రభుత్వం నియామక వ్యవస్థలో మార్పులు చేసిందని మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. రాజ్యాంగ వ్యవస్థలను బలహీనపరుస్తున్న కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘాన్ని ఉపయోగించుకుని మైనారిటీలు, గిరిజనులు, లౌకికవాదుల ఓట్లను తొలగిస్తోందని విమర్శించారు.తెలంగాణలోనే 27 శాతం ఓట్లు తొలగించారని ఆయన పేర్కొన్నారు. మహారాష్ట్రలో ఎన్నికల ఫలితాల్లో మూడు నెలల వ్యవధిలో గణనీయమైన మార్పు ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు.

## బంగ్లాదేశ్ రిసార్టులో ఘోర అగ్నిప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

ప్రాణాలు కోల్పోగా, మరో తొమ్మిది మంది గాయపడ్డారు. మరికొందరి ఆచూకీ తెలియకపోవడంతో ఆందోళన నెలకొంది.మంటలు వేగంగా వ్యాపించడంతో మూడు అంతస్తుల కలప భవనం పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదం జరిగిన సమయంలో అక్కడ సుమారు 30 మంది ఉన్నట్లు అధికారులు తెలిపారు. కొందరు ప్రాణాలతో బయటపడగా, మిగతావారి పరిస్థితిపై స్పష్టత రావాల్సి ఉంది.సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను గుర్తించేందుకు అవసరమైన నమూనాలను సేకరించనున్నట్లు అధికారులు వెల్లడించారు.అగ్నిప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. వంటగదిలో మంటలు చెలరేగడం లేదా విద్యుత్ లోపం కారణమై ఉండవచ్చని ప్రాథమికంగా అనుమానిస్తున్నప్పటికీ, దర్యాప్తు పూర్తయ్యే వరకు నిర్ధారణకు రాలేమని అధికారులు తెలిపారు.

## విద్యార్థినులపై పోలీసుల దౌర్జన్యం సిగ్గుచేటు

(మొదటి పేజీ తరువాయి)

భయభ్రాంతులకు గురిచేసి, వారు మరోసారి ప్రశ్నించకుండా చేయడమే లక్ష్యంగా దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు.విద్యార్థులతో మాట్లాడిన సందర్భంగా వారు వెల్లడించిన విషయాలను రాహుల్ గాంధీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పంచుకున్నారు. పోలీసుల దాడుల్లో తమపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని, దుస్తులు లాగడం, శరీరంలోని వ్యక్తిగత భాగాలను తాకడం వంటి చర్యలకు పాల్పడ్డారని బాధిత విద్యార్థినులు తనకు చెప్పినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రశ్నించే గొంతులను అణచివేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని రాహుల్ ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలను ఉద్దేశించి విమర్శలు చేశారు. యువత, మహిళలపై పోలీసుల హింస ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారుతుందని పేర్కొన్నారు.ఈ ఘటనపై సంబంధిత పోలీసులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. అయితే, విద్యార్థినులు చేసిన ఆరోపణలపై అధికారికంగా వెలువడే వివరాలు, దర్యాప్తు ఫలితాలు కీలకం కానున్నాయి.

## ప్రకృతి ఆరాధనే బతుకమ్మ

(మొదటి పేజీ తరువాయి)

చాటిచెప్పే ఈ పండుగ ప్రజల మధ్య ఐక్యతను పెంపొందిస్తుందని తెలిపారు. పూలతో బతుకమ్మను అలంకరించి, పాటలు పాడుతూ సంప్రదాయబద్ధంగా జరుపుకునే ఈ వేడుకలు మన సంస్కృతీ వైభవాన్ని ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

## సీజేపీ నేత అభిజీత్ దీప్కేకు బెయిల్

- **ఏడాది పాటు శాంతిభద్రతలకు భంగం కలిగించరాదని షరతు**
- **నిరసన ప్రదర్శనకు వెళ్తుండగా నిర్బంధం.. నేహా బోరా కూడా విడుదల**

**తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 17:** కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేకు ఢిల్లీలోని ప్రత్యేక కార్యనిర్వాహక మేజిస్ట్రేట్ శనివారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో నిర్వహించిన 'లెహ్రా దో తిరంగా' నిరసన ప్రదర్శనలో పాల్గొనేందుకు వెళ్తుండగా పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు.ముందస్తు చర్యల్లో భాగంగా దీప్కేపై కేసు నమోదు చేసి, మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. ఏడాది పాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడబోనని హామీ ఇస్తూ పూచీకత్తు సమర్పించాలని న్యాయస్థానం ఆదేశించింది. తదుపరి నిర్బంధం అవసరం లేదని పేర్కొంటూ షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది.ఇదే నిరసన ప్రదర్శనలో పాల్గొన్న అఖిల భారత విద్యార్థి సంఘం అధ్యక్షురాలు నేహా బోరాను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం శనివారం ఉదయం ఆర్‌కే పురం పోలీస్‌స్టేషన్ నుంచి ఆమెను విడుదల చేశారు.

## గోదావరికావేరి అనుసంధానం ముసుగులో మరో కుట్ర!

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపించారు. దీనివల్ల తెలంగాణకు దక్కాల్సిన గోదావరి జలాల వాటాపై ప్రభావం పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.గోదావరికావేరి నదుల అనుసంధాన ప్రాజెక్టుపై నవంబర్ 3న ఢిల్లీలో జాతీయ జల అభివృద్ధి సంస్థ సమావేశం జరగనున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరించాలని హరీశ్‌రావు కోరారు. రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం కలగకుండా కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.తెలంగాణకు రావాల్సిన గోదావరి జలాల వాటాపై స్పష్టత వచ్చిన తర్వాతే నదుల అనుసంధాన ప్రాజెక్టుపై ముందుకు వెళ్లాలని ఆయన సూచించారు. రాష్ట్ర సాగునీటి ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని కోరారు.**గోదావరి జలాల వాటాపై స్పష్టత అవసరం** తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన నీటి వాటాను పరిరక్షించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని హరీశ్‌రావు పేర్కొన్నారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నదుల అనుసంధాన ప్రతిపాదనలను పరిశీలించాలని సూచించారు.

# భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

- **సమగ్ర భూ సర్వేపై మంత్రి పొంగులేటి సమీక్ష**
- **భూ యజమానులకు ముందస్తు నోటీసులు ఇవ్వాలి.. పారదర్శకంగా సర్వే చేపట్టాలి**



**తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 17:** తెలంగాణ రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూ సర్వేపై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. భూ సర్వేలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని, సర్వే ప్రారంభించే ముందు భూ యజమానులకు నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.రాష్ట్రవ్యాప్తంగా మూడు దశల్లో భూ సర్వే నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. తొలి దశలో ఇప్పటికే 2,720 గ్రామాల్లో సర్వే పూర్తయిందని, వచ్చే నెలాఖరులోగా మొదటి దశను పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ప్రతి భూకమతానికి కచ్చితమైన సరిహద్దులు నిర్ణయించి, ప్రతి సర్వే నంబరుకు ప్రత్యేక భూదార్ గుర్తింపు సంఖ్య కేటాయించనున్నట్లు చెప్పారు.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భూములను కొలిచి, వివరాలను డిజిటల్ రూపంలో భద్రపరచడంతో పాటు భూభారతి అంతర్జాల వేదికలో నమోదు చేస్తామని తెలిపారు. సర్వేకు సంబంధించి భూ యజమానులకు అభ్యంతరాలు ఉంటే స్వీకరించి పరిశీలిస్తామని స్పష్టం చేశారు.ప్రభుత్వ భూములు, ప్రైవేటు భూములు, గ్రామకంఠాల సరిహద్దుల విషయంలో స్పష్టత ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనకు విస్తృత చర్యలు

**• పటిష్ట నిఘా పెట్టాలి.. శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలి: కలెక్టర్ దివాకర టీఎస్**



**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 17:** జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల రవాణా, విక్రయాలు, వినియోగాన్ని అరికట్టేందుకు అన్ని శాఖలు సమన్వయంతో కఠిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో మాదకద్రవ్యాల నిర్మూలన చర్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఇప్పటివరకు 55 గంజాయి, మాదకద్రవ్యాల కేసులు నమోదు కాగా, 137 మందిని అరెస్టు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అంతర్రాష్ట్ర మార్గాలపై నిరంతర నిఘా ఉంచాలని, విద్యాసంస్థల వద్ద తనిఖీలు పెంచాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో ఇప్పటివరకు 57 అవగాహన సదస్సులు నిర్వహించామని, అన్ని విద్యాసంస్థల్లో మాదకద్రవ్యాల వ్యతిరేక క్లబ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మత్తు పదార్థాల బారినపడిన వారికి చికిత్స, కౌన్సెలింగ్, పునరావాసం కల్పించాలని, వైద్యుల చీటీ లేకుండా మత్తు మందులు విక్రయించే దుకాణాలపై చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాను మాదకద్రవ్య రహితంగా మార్చేందుకు ప్రజలు, తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. మత్తు పదార్థాల రవాణా, విక్రయాల సమాచారం 1908 నంబరుకు తెలియజేయవచ్చని, సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ సమావేశంలో శిక్షణ సహాయ కలెక్టర్ పారస్ కుమార్, వైద్యాధికారులు, పోలీసు అధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పిట్టలదొర వేషంలో సామాజిక చైతన్యానికి శ్రీకారం!

**- హాస్యంతో నవ్విస్తూ.. సందేశాలతో ఆలోచింపజేస్తూ ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ వినూత్న ప్రచారం**




**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 17:** వినోదాన్ని సామాజిక బాధ్యతతో మేళవిస్తూ ప్రభుత్వ ఉపాధ్యాయుడు, సామాజిక కార్యకర్త రాచకొండ ప్రభాకర్ వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టారు. పిట్టలదొర వేషధారణలో ప్రజల ముందుకు వస్తూ గంజాయి, మాదకద్రవ్యాల నివారణతో పాటు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్నారు. సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం గోరంట్ల ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆయన, తనదైన శైలిలో ప్రజలను చైతన్యపరుస్తున్నారు. మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని, వాటి వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక, ఆర్థిక నష్టాలను గుర్తించాలని ఆయన సూచిస్తున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని చెబుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని, వాహనదారులంతా ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పిలుపునిస్తున్నారు. సాధారణంగా దసరా సమయంలో గ్రామాల్లో వినోదాన్ని పంచే పిట్టలదొర వేషాన్ని సామాజిక సందేశాల ప్రచారానికి ఉపయోగించడం ఆయన ప్రత్యేకత. శనివారం ఖమ్మం జిల్లా కేంద్రంలోని న్యూ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో హాస్యభరితమైన మాటలతో ప్రజలను ఆకట్టుకుంటూ గంజాయి, మాదకద్రవ్యాల నివారణ, రోడ్డు భద్రత అంశాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతకు ప్రాధాన్యమిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నదే తన ప్రచారం వెనుక ప్రధాన ఉద్దేశమని ప్రభాకర్ తెలిపారు. మరుగున పడుతున్న జానపద కళలను వెలుగులోకి తీసుకురావడం కూడా తన బాధ్యతగా భావిస్తున్నానని పేర్కొన్నారు. నవ్వులు పంచే వేషధారణతో మంచి సందేశాన్ని అందిస్తూ ఆయన చేస్తున్న ప్రయత్నం ప్రజల్లో సామాజిక చైతన్యాన్ని పెంపొందించే దిశగా సాగుతోంది.

# చిన్నకొండూరులో ఘనంగా దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు

**- దాతల సహకారంతో అన్నదానం.. అమ్మవారి సేవలో ఎరుకల సంధ్య రాందాస్ గౌడ్**





**తొలి అక్షరం/చౌటుప్పల్, అక్టోబర్ 17:** చిన్నకొండూరు గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఎరుకల సంధ్య రాందాస్ గౌడ్ ప్రతిరోజూ అమ్మవారికి చీరలు, పూజా సామగ్రి సమర్పిస్తూ ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. దేవాలయ అధ్యక్షుడు ఎరుకల రాందాస్ గౌడ్ ఆధ్వర్యంలో పూజలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామ సర్పంచ్ తిగుళ్ల చంద్రయ్య అమ్మవారి విగ్రహ దాతగా ప్రత్యేక గుర్తింపు పొందారు. దాతల సహకారంతో అన్నదానం నిర్వహించడం అభినందనీయమని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గడ్డం సత్తయ్య, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఓల్డ్ మల్లాపూర్‌లో శాంతిభద్రతల పరిరక్షణకు సహచరి ప్రత్యేక సదస్సు

**- మహిళల రక్షణ, సైబర్ నేరాలపై విస్తృత అవగాహన**

**- హాజరైన సబ్ ఇన్‌స్పెక్టర్లు మైబెల్లి, గోవర్ధన్**



**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి. సైదులు),అక్టోబరు17:** మల్లాపూర్ గ్రామంలోని ఓల్డ్ మల్లాపూర్ దుర్గామాతా మండపం వద్ద మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో సహచరి బతుకమ్మ- 2026 కార్యక్రమంలో భాగంగా మహిళల భద్రత, సైబర్ నేరాలపై అవగాహన సదస్సును శనివారం రాత్రి నిర్వహించారు. మహిళారక్షణ, సైబర్ మోసాల పట్ల స్థానిక ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ఎస్సై మైబెల్లి,ఎస్సై గోవర్ధన్ లతో పాటు పెట్రోల్ మొబైల్ సిబ్బంది పాల్గొని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్సైలు మైబెల్లి,గోవర్ధన్ మాట్లాడుతూ....మారుతున్న కాలానికి అనుగుణంగా సైబర్ నేరాలు పెరుగుతున్నాయని,ఎట్టిపరిస్థితుల్లోనూ అపరిచిత వ్యక్తులకు బ్యాంక్ వివరాలు, ఓటీపీలు పంచుకోవద్దని హెచ్చరించారు. ఆన్‌లైన్ పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, లాటరీల పేరుతో వచ్చే మోసపూరిత లింకులను క్లిక్ చేయకూడదని సూచించారు. ఒకవేళ



సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్‌కు గానీ, 100/112 కు గానీ సమాచారం అందించాలని స్పష్టం చేశారు. అలాగే బతుకమ్మ, దసరా ఉత్సవాల వేళ మహిళల భద్రతకు పోలీస్ యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని వెల్లడించారు. పెట్రోల్ మొబైల్ సిబ్బందితో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు, స్థానికులు, కాలనీవాసులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# జనగణన-2027పై రెండో దశ శిక్షణ పూర్తి

**• క్షేత్రస్థాయి విధులను సమర్థవంతంగా నిర్వహించాలి: జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాస్**



**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 17:** జనగణన-2027 ప్రక్రియలో భాగంగా చార్జ్ క్లర్కులు, సాంకేతిక సహాయకులకు నిర్వహించిన రెండో దశ శిక్షణా కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ఏ. శ్రీనివాస్ తెలిపారు. ఖమ్మం జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో రెండు రోజుల పాటు ఈ శిక్షణ నిర్వహించారు. హైదరాబాద్‌లోని జనగణన సంచాలకుల కార్యాలయానికి చెందిన అధికారులు హిమవర్ష, రాజు శిక్షకులుగా హాజరై జనగణన విధివిధానాలపై అవగాహన కల్పించారని శ్రీనివాస్ తెలిపారు. జిల్లాలోని మండల తహసీల్దార్ కార్యాలయాలు, మున్సిపాలిటీలు, ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న చార్జ్ క్లర్కులు, సాంకేతిక సహాయకులకు శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. జనగణన దేశ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు ఎంతో కీలకమని ఆయన అన్నారు. 2027లో చేపట్టనున్న జనగణనలో భాగంగా క్షేత్రస్థాయిలో వివరాల సేకరణ, దరఖాస్తుల నమోదు, చరవాణి అనువర్తనాలు, అంతర్జాల వేదికల వినియోగం, చార్జ్ రిజిస్టర్ల నిర్వహణ వంటి అంశాలపై శిక్షణ అందించినట్లు వివరించారు. జనగణన ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, నిర్ణీత గడువులోగా విధులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. విధుల నిర్వహణలో సందేహాలు ఎదురైతే వెంటనే నివృత్తి చేసుకుంటూ, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రణాళిక విభాగ అధికారులు, వివిధ మండలాలు, మున్సిపాలిటీల చార్జ్ క్లర్కులు, సాంకేతిక సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఐలమ్మ స్ఫూర్తి నేటి యువతరానికి ఆదర్శం.



**- డాక్టర్ నలమాస కృష్ణ హైకోర్టు అడ్వకేట్. ( విగ్రహ దాత)**

**తొలి అక్షరం/నెల్లికుదురు అక్టోబర్ 17:** నెల్లికుదురు మండలం శ్రీరామగిరీ గ్రామంలో చాకలి ఐలమ్మ విగ్రహ ప్రతిష్ట చేయడం జరిగింది. నల్లమస కృష్ణ మాట్లాడుతూ చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి యువతరానికి ఆదర్శం కావాలని డాక్టర్ నలమాస కృష్ణ హైకోర్టు అడ్వకేట్( విగ్రహ దాత) అన్నారు. శనివారం మండలంలోని శ్రీరామగిరి గ్రామంలో చాకలి ఐలమ్మ యువజన సంఘం నిర్వహ ణలో అత్యంత వైభవంగా ప్రతిష్టాపించిన వీర నారీ ఐలమ్మ విగ్రహాన్ని నలంద విద్యాసంస్థక కర స్పాండెంట్ డాక్టర్



డోలి సత్యనా రాయణ,మానుకోట బార్ అసోసియేషన్ అధ్యక్షులు మామిడాల సత్యనారా యణతో కలిసి డాక్టర్ నలమాస కృష్ణ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ఐలమ్మ యువజన సంఘం అధ్యక్షులు సంపత్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విశిష్ట అతిథిగా పాల్గొని మాట్లాడుతూ,తెలంగాణ సాయుధ పోరాటానికి ప్రతికగా వీరనారీగా పేరుగాంచిన ఐలమ్మ ఆమె స్ఫూర్తి నేటి యువతరానికి ఆదర్శం కావాలని, రాజధాని నడిబొడ్డున ఉన్న మహిళా విశ్వవిద్యాలయానికి చాకలి ఐలమ్మ పేరు పెట్టడం ఆమె పోరాటకీర్తి ప్రతిష్టలకు నిదర్శనం అన్నారు. ప్రజల కోసం న్యాయం కోసం పోరాటం చేసిన వారు ప్రజల గుండెల్లో జీవించే ఉంటారన్నారు. సబ్బండ సబ్బండ వర్గాల కోసం త్యాగం చేసిన ఘనత ఐలమ్మ కి దక్కిందని అందుకే ఆమె వీరనారిగా ఆమె స్మరించుకోవడం మన అందరి అదృష్టం అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మాదారి ప్రశాంత్, సంఘం ప్రధాన కార్యదర్శి మడి పెద్ది ముఖేష్ ప్రముఖ సింగర్ ప్రసాద్, ప్రముఖ వైద్యులు ప్రొఫెసర్స్ డాక్టర్ మడి పెద్ది వెంకన్న, డాక్టర్ కూరపాటి రమేష్, మాజీ సర్పంచ్ డాక్టర్ ఆదూ రి కళాధర్ రాజు, బిఎస్పీరాష్ట్ర నాయకులు దార్ల శివరాజ్,సంఘం గౌరవ సలహాదారులు పోరండ్ల సోమయ్య, లక్ష్మయ్య, రాములు నిమ్మల బిక్షం,పైండ్ల శ్రీనివాస్, సభ్యులు పోరండ్ల రవితేజ, సతీష్, హరీష్ మడిపెద్ధి బిక్షం,పోరండ్ల శ్రీనివాస్ శ్రీకాంత్,సమ్మయ్య,సిరి స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు ఎదునూరి శ్రీనివాస్, ప్రముఖులు వాసం ఆనంద్ కె నాగయ్య మీ ఐలయ్య డో నికని శ్రీనివాస్ బెల్లి నరసయ్య,తూటి వెంకటరెడ్డి ఇసంపల్లి సైదులు, తదితరులు పాల్గొనగా కార్యక్రమం అనంతరం నల్ల మాస కృష్ణకు చాకలి ఐలమ్మ సంఘం సభ్యులచే ఘన సన్మానం గావించగా. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



# నవంబర్ నెలాఖరులోగా వైద్య కళాశాల, తీగల వంతెన పనులు పూర్తి చేయాలి

**నిర్మాణాల్లో వేగం పెంచాలి.. నాణ్యతా ప్రమాణాలు పాటించాలి**

**అభివృద్ధి పనులను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ దివాకర టి.ఎస్.**



తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 17: ఖమ్మం నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. నవంబర్ నెలాఖరులోగా ప్రభుత్వ వైద్య కళాశాల భవనాలు, మున్నేరు నదిపై నిర్మిస్తున్న తీగల వంతెన పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. శనివారం ఖమ్మం కాల్వొడ్డు వద్ద మున్నేరు నదిపై నిర్మిస్తున్న తీగల వంతెన పనులను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం రఘునాథపాలెం మండలంలోని ప్రభుత్వ వైద్య కళాశాల, గిరిజన సంక్షేమ పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, శిక్షణ సహాయ కలెక్టర్ పారస్ కుమార్‌తో కలిసి పనుల పురోగతిని సమీక్షించారు. ప్రభుత్వ వైద్య కళాశాల భవనాలు, ప్రహరీ గోడ, వసతి గృహాలు, అంతర్గత రహదారులు, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతుల పనులను సమాంతరంగా చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ముందుగా కింది అంతస్తు, మొదటి అంతస్తులకు సంబంధించిన విద్యుత్ పనులను పూర్తి చేసి వినియోగానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి కళాశాలను అందుబాటులోకి తీసుకువచ్చేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. బాలికల వసతి గృహ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి, విద్యార్థినులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. వారి భద్రతకు ప్రాధాన్యమిస్తూ నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. మున్నేరు నదిపై నిర్మిస్తున్న తీగల వంతెనకు సంబంధించిన మిగిలిన పనులను వేగవంతం చేసి నవంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నిర్మాణ నాణ్యత, భద్రత విషయంలో రాజీ పడరాదని, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. రఘునాథపాలెంలోని గిరిజన సంక్షేమ పాఠశాల నిర్మాణాలను పరిశీలించిన కలెక్టర్.. ప్రధాన భవనం, వసతి గృహాలు, వంటగది, భోజనశాల పనులను నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని, తాగునీటి సరఫరా ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ తనిఖీల్లో ఆర్అండ్‌బీ ఎస్ఈ యుగంధర్, రఘునాథ పాలెం తహసీల్దార్ శ్వేత, వైద్యశాఖ అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందాకు మర్యాదపూర్వక స్వాగతం





తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 17: ఖమ్మం జిల్లా పర్యటనకు వచ్చిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందాను శనివారం ఎన్ఎస్‌పీ అతిథి గృహంలో జిల్లా జడ్జి ఎం. నాగరాజు, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తికి పూల మొక్కను అందజేసి స్వాగతం పలికారు.

# ఖమ్మం నగరంలోని 57వ డివిజన్‌లో శ్రీదేవి శరన్నవరాత్రుల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదానం





తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 17: అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక శోభ మధ్య శరన్నవరాత్రుల వేడుకల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ అన్నదాన కార్యక్రమానికి స్థానిక ప్రజలు, భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి ప్రసాదం స్వీకరించారు. డివిజన్‌లోని అన్ని వర్గాల ప్రజలను ఒకచోట చేర్చుతూ, ప్రజల మధ్య పరస్పర ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందించేలా ఈ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు నల్ల కృష్ణ రెడ్డి, శేఖర్, దేవల వెంకట్, ఆలస్యం రమేష్, పునీత్, అఖిల్ ఈ కార్యక్రమ ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించి, ఎలాంటి అసౌకర్యం కలగకుండా విజయవంతం చేశారు. మహిళా కమిటీ సభ్యులు నల్ల స్వరూప రాణి, శోభా, గౌరీ, ధనలక్ష్మి, ఉష, స్వప్న తదితరులు భక్తులకు స్వయంగా అన్నదానం చేసి తమ భక్తిభావాన్ని, సేవా తత్పరతను చాటుకున్నారు. అమ్మవారి ఆశీస్సులతో డివిజన్ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, భవిష్యత్తులోనూ ఇలాంటి ఆధ్యాత్మిక మరియు సామాజిక కార్యక్రమాలను మరింత ఘనంగా నిర్వహించాలని కమిటీ సభ్యులు ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

# భక్తిభావంతో అన్నదానం.. దుర్గమ్మ సేవలో బడుగు కుటుంబం!

**చౌటుప్పల్‌లో ఘనంగా 37వ వార్షిక దుర్గాదేవి శరన్నవరాత్రోత్సవాలు**

**ముఖ్య అతిథులుగా పురపాలక వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, కౌన్సిలర్ పిల్లలమర్రి మధుసూదన్**





తొలి అక్షరం/చౌటుప్పల్, అక్టోబర్ 17: చౌటుప్పల్ పట్టణంలోని మార్కండేయ నగర్‌లో గల శ్రీ శివభక్త మార్కండేయ స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న 37వ వార్షిక శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ అన్నదాన కార్యక్రమానికి బడుగు బలరాములు, సరస్వతి కుటుంబానికి చెందిన డాక్టర్ బడుగు బాలకృష్ణ, డాక్టర్ బడుగు అరుణ దంపతులు, వారి కుమార్తె శ్రీపావన, అలాగే బడుగు వెంకటేశ్వర్లు, హుజాత కుటుంబానికి చెందిన సాయి భువన్, కుందన్ సాయి అన్నప్రసాద దాతలుగా వ్యవహరించారు. భక్తులకు అన్నప్రసాదం అందించేందుకు ముందుకు వచ్చిన దాతలను నిర్వాహకులు అభినందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చౌటుప్పల్ పురపాలక సంఘం వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, 19వ వార్డు కౌన్సిలర్ పిల్లలమర్రి మధుసూదన్ హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. నవరాత్రి ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావంతో పాటు ఐక్యత, సేవాభావాన్ని పెంపొందిస్తాయని వారు పేర్కొన్నారు. దుర్గాదేవి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గోలి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ అధ్యక్షుడు బడుగు జయప్రకాష్, ఉపాధ్యక్షులు నోముల రఘునాథ్, గోశిక బాలాజీ, చంద్రకళ నరసింహ, కోశాధికారి బడుగు సుజాత నరసింహ, సాంస్కృతిక కార్యదర్శి బడుగు క్రాంతి కుమార్, ప్రచార కార్యదర్శి కర్నాటి జనార్దన్, సమన్వయ కార్యదర్శులు బాల్యం అనిల్ కుమార్, గుర్రం సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

# అభ్యుదయ యూత్ నూతన కమిటీ ఎన్నిక

**- అధ్యక్షుడిగా చెవగొని వెంకటేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా లింగంస్వామి గౌడ్**



తొలి అక్షరం/చౌటుప్పల్, అక్టోబర్ 17: చౌటుప్పల్ రామ్‌నగర్‌లో అభ్యుదయ యూత్ నూతన కమిటీని శనివారం ప్రకటించారు. గౌరవ సలహాదారులు చెరుకు అశోక్ గౌడ్, వర్కాల వెంకట్ కుమార్ గౌడ్, గౌరవ అధ్యక్షుడు తూర్పునూరి బాబు గౌడ్ ఆధ్వర్యంలో కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చెవగొని వెంకటేష్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా మార్గం నరసింహ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా తూర్పునూరి లింగంస్వామి గౌడ్, కోశాధికారిగా వెంకటేష్ గౌడ్, కార్యదర్శిగా తరపునూరి చిన్న మల్లేష్ గౌడ్, కార్యనిర్వహణ కార్యదర్శిగా వర్కాల జయరాం గౌడ్, సలహా కార్యదర్శిగా చెవ్వగొని రమేష్ గౌడ్, ప్రచార కార్యదర్శిగా చెరుకు రాము గౌడ్, సాంస్కృతిక కార్యదర్శులుగా తూర్పునూరి సాయిలు గౌడ్, బాలగోని రాంప్రసాద్ గౌడ్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా తరపునూరి వెంకటేష్ గౌడ్, బెదరకోట వెంకటేష్, ఉష్కాకుల శ్రీశైలం గౌడ్, బందారం శివ గౌడ్, చెరుకు సాయి గౌడ్, మొగుదాల రమేష్ గౌడ్, ఓదరి రాకేష్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు చెవగొని వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ, కమిటీ ఏర్పాటుకు సహకరించిన పెద్దలు, కాలనీవాసులు, సీనియర్ యూత్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తరపునూరి పెద్ద మల్లేష్ గౌడ్, బాలగోని నరసింహ గౌడ్, తూర్పునూరి జంగయ్య గౌడ్, విశ్వరూపం చారి, చెవ్వగొని మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నీ ఓటు నీ భవిష్యత్తు... పట్టభద్రులారా మేల్కొండి!

**ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు కావాలి.. నిరుద్యోగంపై గళమెత్తాలి!**

**యువతకు ఉపాధి.. స్థానికంగా పరిశ్రమలు.. ఆధునిక సాంకేతిక విద్యే లక్ష్యం: డా. చిలకల శ్రీనివాస్ యాదవ్**



తొలి అక్షరం/చౌటుప్పల్ అక్టోబర్ 17: ఉమ్మడి ఖమ్మంవరంగల్ నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలోని ప్రతి అర్హుడైన పట్టభద్రుడు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు కావాలని డా. చిలకల శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. ఓటు హక్కును నిర్లక్ష్యం చేయకుండా, యువత భవిష్యత్తును ప్రభావితం చేసే అంశాలపై చైతన్యంతో నిర్ణయం తీసుకోవాలని సూచించారు. డిగ్రీలు, పీజీలు పూర్తి చేసిన యువత ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూసే పరిస్థితి మారాలని, ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు పారదర్శకంగా జరగడంతో పాటు ప్రైవేటు రంగంలోనూ ఉపాధి అవకాశాలు పెరగాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆధునిక సాంకేతిక విద్య, నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. హైదరాబాద్‌కే పరిశ్రమలు పరిమితం కాకుండా ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల్లో సాఫ్ట్‌వేర్ సంస్థలు, సాంకేతిక కేంద్రాలు, చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. యువత వలసలు తగ్గి, సొంత ప్రాంతాల్లోనే ఉపాధి పొందేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధి, విద్య, పరిశ్రమలు, స్వయం ఉపాధి, సామాజిక న్యాయం, ప్రజాప్రతినిధుల జవాబుదారీ తనం పట్టభద్రుల అభివృద్ధికి కీలకమని తెలిపారు. అభ్యర్థుల పనితీరు, ప్రజా సమస్యలపై అవగాహన, ప్రజాసేవ పట్ల నిబద్ధతను పరిశీలించి ఓటు వేయాలని సూచించారు. ప్రతి అర్హుడైన పట్టభద్రుడు అధికారిక ఎన్నికల మార్గదర్శకాల ప్రకారం ఓటరుగా నమోదు కావాలని, ఇతర పట్టభద్రులకూ అవగాహన కల్పించాలని కోరారు. నీ ఓటు మార్పుకు ఆయుధం నీ నిర్ణయం యువత భవిష్యత్తుకు పునాది! అని డా. చిలకల శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు.

# భక్తిశ్రద్ధలతో దుర్గా నవరాత్రి ఉత్సవాలు.. ఘనంగా అన్నదానం!

**అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన పురపాలక చైర్మన్ మోగుదాల పావని రమేష్ గౌడ్**

**20 ఏళ్లుగా ఆధ్యాత్మిక సంప్రదాయం కొనసాగింపు: కమిటీ అధ్యక్షుడు తాడూరు వెంకటేశం**



తొలి అక్షరం/చౌటుప్పల్: చౌటుప్పల్ పట్టణంలోని గాంధీ పార్కులో శ్రీ దుర్గా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుర్గా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పురపాలక చైర్మన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదం అందించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు తాడూరు వెంకటేశం మాట్లాడుతూ, గత 20 ఏళ్లుగా సంప్రదాయబద్ధంగా దుర్గా నవరాత్రి ఉత్సవాలను నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. దుర్గామాత ఆశీస్సులు చౌటుప్పల్ పట్టణ ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. నవరాత్రి ఉత్సవాల ద్వారా భక్తిభావంతో పాటు సేవా స్ఫూర్తిని చాటుతున్నామని, అమ్మవారి కృపతో రానున్న రోజుల్లోనూ ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, కౌన్సిలర్లు, భక్తులు, పట్టణ ప్రజలు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

# రామన్నపేట ప్రజలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు



తొలి అక్షరం/రామన్నపేట, అక్టోబర్ 17:

రామన్నపేట మండల ప్రజలకు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు, నా ఇంటి ఆడపడుచులకు ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షుడు, బీఆర్ఎస్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు ఎస్.కె. చాంద్ సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, ఆడపడుచుల జీవితాల్లో సుఖసంతోషాలు నింపాలని, ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు.

# యాదాద్రి జిల్లా ప్రజలకు సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు

- కప్పల రవికుమార్ గౌడ్ (పరిటాల రవి)
- సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం యాదాద్రి జిల్లా అధ్యక్షులు



తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 17:యాదాద్రి జిల్లా ప్రజలకు వివిధ మండలాల పరిసర గ్రామల ప్రజలకు సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం యాదాద్రి జిల్లా అధ్యక్షులు కప్పల రవికుమార్ గౌడ్ శుభాకాంక్షలు తెలిపినారు సద్దుల బతుకమ్మ పండుగ అంటేనే తెలంగాణ ఆడపడుచులకు చాలా గొప్ప పండుగని ఆడపడుచులు అందరూ కలిసి తమకు ఇష్టమైన గౌరమ్మ తల్లి పాటలు పాడుతూ ఆ బతుకమ్మ తల్లిని మనస్ఫూర్తిగా కొలుస్తారు గ్రామంలో ఉన్న ప్రజలు చాలా ఆనందంగా ఉండాలని పాడిపంటలు సమృద్ధిగా పండాలని ఆ బతుకమ్మ తల్లిని కొలుస్తారు ఇంత గొప్ప పండుగ అయిన బతుకమ్మ తల్లి పండుగను యాదాద్రి జిల్లా ప్రజలకు వివిధ మండలాల పరిసర గ్రామల ప్రజలు మంచిగా జరుపుకోవాలని వారికి శుభాకాంక్షలు తెలిపినారు ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పరకాల అంజయ్య గౌడ్ జిల్లా ఉపాధ్యక్షులు గంగాపురం యాదయ్య గౌడ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పంజాల.మల్లేష్ గౌడ్ కట్టెకోల హనుమంతు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామగిరిలో బతుకమ్మ తల్లి విగ్రహ ఆవిష్కరణ

**- ఎమ్మెల్యే మురళి నాయక్, డీసీసీ అధ్యక్షురాలు ఉమా మురళి నాయక్**





తొలి అక్షరం/నెల్లికుదురు అక్టోబర్ 17: నెల్లికుదురు మండలంలోని శ్రీరామగిరి గ్రామంలో నిర్వహించిన బతుకమ్మ తల్లి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎమ్మెల్యే డా. భూక్యా మురళి నాయక్, డీసీసీ అధ్యక్షురాలు ఉమా మురళి నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బతుకమ్మ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించి, బతుకమ్మ పండుగ విశిష్టతను, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను స్మరించుకున్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతిని ఆరాధించే సంప్రదాయానికి బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ప్రాధాన్యత కలిగి ఉన్నాయ ని తెలిపారు. స్థానిక సర్పంచ్ ప్రశాంత్ , డిసిసి అధ్యక్షులు భూక్య ఉమా మురళి నాయక్, మండల మాజీ అధ్యక్షులు గొల్లపల్లి ప్రభాకర్, డిసిసి మాజీ ఉపాధ్యక్షులు బాలాజీ నాయక్, గ్రామ సర్పంచులు, బాలకృష్ణ, ఇట్టేలా దేవేందర్ రెడ్డి, శ్రీనివాస్,మండల నాయకులు, ఉప సర్పంచ్ సుమన్,నర్సయ్య,మల్లయ్య,సమ్మయ్య,వెంకన్న,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రామన్నపేట మండల ప్రజలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు: ఎంఈఓ తంగెళ్ల సురేందర్ రెడ్డి



తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 17:రామన్నపేట మండల ప్రజలందరికీ సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు మండల విద్యాధికారి (ఎంఈఓ) లితంగెళ్ల సురేందర్ రెడ్డి .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగను ప్రజలందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో జరుపుకునే ఈ పండుగ ప్రకృతితో మమేకమై, కుటుంబ బంధాలను, సామాజిక ఐక్యతను బలపరుస్తుందని తెలిపారు. మండలంలోని ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు వెల్లివిరియాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

# రామన్నపేట మండల ప్రజలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

**- బండ మధుకర్ రెడ్డి బిజెపి పార్టీ మండల అధ్యక్షులు రామన్నపేట**

తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 17:
రామన్నపేట మండల ప్రజలకు కొమ్మాయిగూడెం గ్రామ ప్రజలకు. వివిధ పార్టీల నాయకులకు వివిధ శాఖల అధికారులకు. బిజెపి పార్టీ శ్రేణులకు నా ఇంటి ఆడపడుచులకు సద్దుల బతుకమ్మ శు భాకాంక్షలు.మీ ..మధుకర్ రెడ్డిబిజెపి పార్టీ మండల అధ్యక్షులు రామన్నపేట



# సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన 13వ వార్డు కౌన్సిలర్ భక్తుల వాణి విప్లవ్ కుమార్ గౌడ్

- తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ.. ప్రతి ఇంటా సంతోషాలు వెల్లివిరియాలి



తొలి అక్షరం/చౌటుప్పల్: అక్టోబర్ 17: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా చౌటుప్పల్ పట్టణ, మండల ప్రజలందరికీ 13వ వార్డు కౌన్సిలర్ భక్తుల వాణి విప్లవ్ కుమార్ గౌడ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పూలను పూజిస్తూ ప్రకృతిని ఆరాధించే బతుకమ్మ పండుగ ప్రతి ఇంటా ఆనందాలు నింపాలని, మహిళల జీవితాల్లో సంతోషం వెల్లివిరియాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

# పెద్ద కొర్పోల్‌లో విద్యుత్ ఉపకేంద్రం, మహిళా సంఘం భవనానికి శంకుస్థాపన

- మహిళా సంఘాల అభివృద్ధికి పెద్దపీట



తొలి అక్షరం/నెక్కొండ, అక్టోబర్ 17: వరంగల్ జిల్లా నెక్కొండ మండలం పెద్ద కొర్పోల్ గ్రామంలో 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం, మహిళా సంఘం భవన నిర్మాణానికి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి మహిళలు, రైతులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడం, మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడం, గ్రామాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. వ్యవసాయానికి విద్యుత్ ఎంతో కీలకమని, సరఫరాలో ఇబ్బందులు లేకుండా విద్యుత్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ గ్రామీణ అభివృద్ధికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, విద్యుత్ శాఖ అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# కరువు మండలాల జాబితాలో వైరా, కొణిజర్ల, ఏన్కూరును చేర్చాలి

**- వైరా నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి**



తొలి అక్షరం, కొణిజర్ల, అక్టోబర్ 17: కరువు మండలాల జాబితాలో ఏన్కూరు, కొణిజర్ల, వైరా మండలాలను చేర్చి రైతులకు నష్టపరిహారం అందించాలని సీపీఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైరా నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరారు.వైరాలోని బోడేపూడి భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో భూక్యా వీరభద్రంతో పాటు పార్టీ జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి కృష్ణ, సుంకర సుధాకర్, కొణిజర్ల మండల కార్యదర్శి చెరుకుపల్లి కుటుంబరావు మాట్లాడారు. ఏన్కూరు, కొణిజర్ల, వైరా మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయని, రైతులకు తక్షణ సహాయం అందించాలని కోరారు.కారేపల్లి, కామేపల్లి, ఏన్కూరు మండలాలకు సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. మూలపోచారం పంచాయతీ పరిధిలో పోడు భూముల హక్కు పత్రాలు కలిగిన గిరిజన రైతుల పంట రుణాలను మాఫీ చేయాలని కోరారు.**ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో వివక్ష వద్దు** ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో రాజకీయ పక్షపాతాన్ని విడనాడి, అర్హులైన నిరుపేదలకు ఇళ్లు కేటాయించాలని నాయకులు డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీలకు రావాల్సిన నిధులను వెంటనే విడుదల చేసి అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. ఏన్కూరులో పర్యటించనున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సంబంధిత మంత్రులు వైరా నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.

# బతుకమ్మ ఆడే స్థలంలో సీసీ ప్లాట్‌ఫాం ప్రారంభం

**- రూ.50 లక్షల సొంత నిధులతో నిర్మాణం: ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి**



తొలి అక్షరం/నెక్కొండ, అక్టోబర్ 17: వరంగల్ జిల్లా నెక్కొండలోని ఊర చెరువు సమీపంలో బతుకమ్మ ఆడే స్థలంలో సుమారు రూ.50 లక్షల సొంత నిధులతో నిర్మించిన సీసీ ప్లాట్‌ఫాంను నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రారంభించారు. బతుకమ్మ వేడుకలకు అనువైన స్థలాన్ని అభివృద్ధి చేయడంతో మహిళలకు, స్థానిక ప్రజలకు సౌకర్యం కలగనుంది.ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, పెండం రామానంద్, మార్కెట్ చైర్మన్లు రావుల హరీష్‌రెడ్డి, పాలయి శ్రీనివాస్, నెక్కొండ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి బక్కి అశోక్, మండల అధ్యక్షుడు లావుడ్యా తిరుమల్, సహకార సంఘం చైర్మన్లు మాదటి శ్రీనివాస్, ఆవుల శ్రీనివాస్, ఎంపీడీవో యాసం లావణ్య, తహసీల్దార్ వేముల రాజ్‌కుమార్ తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.





# 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి శంకుస్థాపన

- రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం: ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

తొలి అక్షరం/నెక్కొండ, అక్టోబర్ 17: నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా వరంగల్ జిల్లా నెక్కొండ మండలం వెంకటాపురం గ్రామంలో నూతనంగా నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడంతో పాటు విద్యుత్ సరఫరాలో సమస్యలను తగ్గించడమే లక్ష్యంగా ఉపకేంద్రాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. తోపనపల్లి సర్పంచ్ చాగంటి మమత తిరుమల్, సహకార సంఘం డైరెక్టర్ వంగాల నాగిరెడ్డి, చాగంటి నారాయణ, కుల్ల వెంకన్న, నీలకంఠం యాకయ్య, తోకల కరయ్య, మట్టే బాబు, అలువాల మహేందర్ పాల్గొన్నారు.

# దుర్గామాతకు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రత్యేక పూజలు

**- నెక్కొండలో కొనసాగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు**



తొలి అక్షరం/నెక్కొండ, అక్టోబర్ 17: వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదురుగా భద్రకాళి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పాల్గొని దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, జిల్లా కార్యదర్శి బక్కి అశోక్, మండల అధ్యక్షుడు లావుడ్యా తిరుమల్, సహకార సంఘం చైర్మన్ ఆవుల శ్రీనివాస్, కొనిజేటి బిక్షపతి, కుసుమ చెన్నకేశవులు, కొమ్మారెడ్డి రవీందర్‌రెడ్డి, గరిక పాటి కృష్ణారావు, చల్లా రఘోత్తంరెడ్డి, రావుల మహిపాల్‌రెడ్డి, షేక్ షబ్బీర్, చల్లా పాపిరెడ్డి, కొత్తకొండ గణేశ్ పాల్గొన్నారు.

# నూతన ఎస్సైకి సర్పంచ్‌ల బృందం సత్కారం

**- మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు**



తొలి అక్షరం/నెక్కొండ, అక్టోబర్ 17:వరంగల్ జిల్లా నెక్కొండ మండలానికి నూతనంగా బదిలీపై వచ్చిన ఎస్సై జె. శ్రవణ్ కుమార్‌ను మండల సర్పంచ్‌ల బృందం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపింది.ఈ కార్యక్రమంలో నెక్కొండ మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు భూక్యా రమేష్ రాథోడ్, నక్కలగుట్ట తండా సర్పంచ్ డాక్టర్ బానోత్ రవీందర్ నాయక్, నెక్కొండ తండా సర్పంచ్ బానోత్ రవికుమార్, పిట్టకాలబోడు సర్పంచ్ సూర్యభాయ్, వెంకటాపురం సర్పంచ్ కవిత అఖిల్, అలంకానిపేట సర్పంచ్ నిరోషా శ్రవణ్, మడిపల్లి సర్పంచ్ అనూష వినోద్ లోక్‌నాయక్, సాయిరెడ్డిపల్లి సర్పంచ్ బండారుపల్లి వినయ్ కుమారి శ్రీనివాస్, చెరువుముందరి తండా సర్పంచ్ కున్సోత్ మంగమ్మ శ్రీనివాస్, చిన్నకొర్పోల్ సర్పంచ్ అనిత బద్రు, తోపనపల్లి సర్పంచ్ మమత తిరుమల్‌తో పాటు పలు గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

# అనాథ బాలికకు అన్నగా అండగా చిలువేరు సమ్మయ్య గౌడ్ భరోసా

**• ధనముంటే సరిపోదు ఆపదలో ఆదుకునే గుణముండాలి: పీసీసీ సభ్యుడు గుగులోత్ దస్రు నాయక్**



**తొలిఅక్షరం/ కేసముద్రం, అక్టోబరు 12:** కేసముద్రం మండలం కాట్రపెల్లి గ్రామానికి చెందిన, అఖిల కన్నవారికి దూరమై , నాయనమ్మే సర్వస్వంగా బతుకుతున్న ఆ బాలికకు ఆ ఆసరా కూడా దూరమైంది. దీంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న బొద్దుల అఖిలకు కేసముద్రం కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్ అండగా నిలిచారు. 'నువ్వు ఒంటరిదానివి కాదు, నీకు అన్నగా నేనున్నా' అంటూ ఆప్యాయంగా భరోసానిచ్చారు. అంతటితో ఆగకుండా ఆ కుటుంబానికి ఒక క్వింటాల్ బియ్యం, రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. కేసముద్రం మండలం కాట్రపల్లి గ్రామానికి చెందిన బొద్దుల అఖిల జీవితం చిన్ననాటి నుంచే విషాదాలతో నిండిపోయింది. అఖిల నాయనమ్మ స్వరాజ్యం ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ పెంచింది. అఖిలకి అన్నగా నేను ఉన్నానంటూ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సమ్మయ్య అఖిల కి భరోసా ఇచ్చాడు. ఈ కార్యక్రమంలో సామల నర్సయ్య ఉపసర్పంచ్ షాగంటి యాదగిరి, సిరికొండ మల్లయ్య, పుట్ట ప్రభాకర్, జాటోత్ లక్ష్మణ్, రుద్ర యాదగిరి, దాసరి శ్రీనివాస్, బేతూ సత్యం, సాంబారి వీరాస్వామి, కర్పూరపు వెంకటేశ్వర్లు, నల్లగొప్పుల సాయిలు, బోదాసు చంద్రయ్య, సిరికొండ వెంకన్న, అడప రవీందర్, ఓర్సు ముత్తయ్య, నాయిని స్వామి, యెడల్లి దేవరాజు,దేవులపల్లి కట్టయ్య,జినుకల శ్రావన్, నూణావత్ మాను, పాలికోజు బీష్మచారి మరియు కాంగ్రెస్ పార్టీ పెద్దలు, పద్మశాలి కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# మానుకోటకు హారంగా బతుకమ్మ ఘాటు

**- రూ. 4 కోట్ల వ్యయంతో నిర్మాణం**







**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో అక్టోబర్ 17:** మానుకోటకు హారంగా బతుకమ్మ ఘాట్ నిలవనుందని శాసనసభ్యులు వైద్యులు భూక్యా మురళి నాయక్ అన్నారు. శనివారం పురపాలక సంఘ పరిధిలోని 16వ వార్డు మున్నేరు వాగు ఒడ్డున రూ.. నాలుగు కోట్ల వ్యయంతో నిర్మాణం చేస్తున్న బతుకమ్మ ఘాటుకు శాసనసభ్యులు వైద్యులు భూక్యా మురళి నాయక్, చైర్పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్ తో కలిసి కొబ్బరికాయ కొట్టి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానిక వార్డ్ కౌన్సిలర్ బానోత్ పద్మ సీతారాం నాయక్ దంపతులు, 15వ వార్డు కౌన్సిలర్ బాబు లు శాలువాలతో వారిని సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు, ఆడపడుచులు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకునేందుకు ఈ బతుకమ్మ ఘాట్ ఎంతో ఉపయోగకరంగా నిలవనుంది. మహిళలకు సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పించడంతో పాటు, పండుగల సమయంలో ప్రజలకు మెరుగైన వసతులు అందించడమే ఈ నిర్మాణం ప్రధాన ఉద్దేశమన్నారు. పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ, ప్రతి వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడమే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు ముందుకు సాగుతున్నారు. ప్రజల అవసరాలను గుర్తించి, పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ చేపడుతున్న ఇటువంటి కార్యక్రమాలు పట్టణ ప్రగతికి మరింత దోహద పడతాయని ఆశ భవాని వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో పురపాలక సంఘ వైస్ చైర్మన్ సుర్గపు సోమయ్య, కౌన్సిలర్ల అంబాల శివకుమార్, బొల్లు రాజు, కౌన్సిలర్ నీరుటి లక్ష్మీనారాయణ, పద్మ ప్రవీణ్, నిమ్మల మాధవి శ్రీనివాస్, మహమ్మద్ పర్వీన్ ఖలీల్ ,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఎడ్ల రమేష్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, సిపిఎం పార్టీ కార్యకర్తలు మహిళలు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా చండీ హోమం



**తొలి అక్షరం /నెక్కొండ అక్టోబర్ 17:** వరంగల్ జిల్లా నెక్కొండలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో చండీ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆలయంలో కొలువైన దుర్గా అమ్మవారికి పంచామృత అభిషేకాలు విశేష పూజలు నిర్వహించిన అనంతరం వేద పండితులు రాపాక పరిత్రన్ శర్మ , నిఖిల్ నిఖిల్ శర్మ, ఆలయ అర్చకులు బిబిఎన్ శాస్త్రి వేద జ్యోతిష పండితులు శ్రవణ్ కుమార్ శాస్త్రి, కొల్లాపురం సురేష్ శర్మ, అనుముల గోపాల కృష్ణమూర్తి శర్మ, బండ పెల్లి విశ్వనాథ్ శర్మ ఆధ్వర్యంలో గణపతి నవగ్రహ అష్టదిక్పాలక పంచలోకపాలక సర్వతోభద్ర మండల దేవతారాధనలు నిర్వహించి చండీ పారాయణం చేశారు. అనంతరం వేదమంత్రచాలని చండీ హోమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పురోహితులు వర ప్రసాద్ శర్మ, సహజల యువతని శాస్త్రి మధు కృష్ణ, మణిశర్మ , సాయి ఋగ్వేష్ శర్మలు హోమ క్రతువులో భాగస్వాములయ్యారు . శ్రీరామలింగేశ్వర సేవా సమితి బాధ్యతలు డింగిరి శేష పవన్ కుమార్, తాటి పెల్లి శివకుమార్ సురేఖ,బండి విజయభాస్కర్ రెడ్డి సుజాత ,గన్ను సత్యనారాయణ, పొక్కుల ధనిష్ట, కిషన్, మారం సునీత తాటి పెల్లి సురేఖ కొమ్ము అర్చన, కొమ్ము రమేష్ యాదవ్ మానస, గుమ్మడవెల్లి స్వరూప, సంగీత,సుమలత,లహరి, మాలదారులు వంశీ,ఆదిత్య,రాఘవేంద్ర,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్‌తో మృతి చెందిన రఫియా బేగం కుటుంబానికి రూ.12 లక్షల పరిహారం

**- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎంపీపీ ఘటిక అజయ్‌కుమార్**



**తొలి అక్షరం/నెక్కొండ, అక్టోబర్ 17:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం దీక్షకుంట్ల గ్రామానికి చెందిన మహిళా సంఘం నాయకురాలు ఎస్.కె. రఫియా బేగం విద్యుత్ షాక్‌తో మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. రెండేళ్ల క్రితం కుటుంబ పోషణ కోసం భర్త, ఇద్దరు పిల్లలతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లిన ఆమె ఓ ప్రైవేటు సంస్థలో గృహ నిర్వహణ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో విధుల్లో ఉండగా విద్యుత్ షాక్‌కు గురై ప్రాణాలు కోల్పోయారు. విషయం తెలుసుకున్న తెలంగాణ పంచాయతీరాజ్ ట్రిబ్యునల్ మాజీ సభ్యుడు, నెక్కొండ మాజీ ఎంపీపీ ఘటిక అజయ్‌కుమార్ హైదరాబాద్‌కు వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం రఫియా బేగం పనిచేసిన సంస్థ యాజమాన్యంతో చర్చించి, కుటుంబానికి రూ. 12 లక్షల పరిహారం అందించేందుకు అంగీకారం కుదిర్చారు. ఈ పరిహారాన్ని రఫియా బేగం ఇద్దరు పిల్లలకు ఒక్కొక్కరికి రూ. 6 లక్షల చొప్పున ఈ నెల 24న స్థిర డిపాజిట్ల రూపంలో జమ చేయడంతో పాటు, ఆమె భర్తకు అదే సంస్థలో ఉద్యోగం కల్పించేందుకు యాజమాన్యం అంగీకరించినట్లు అజయ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ దయానంద్, దీక్షకుంట్ల మాజీ సర్పంచ్ పులి ప్రసాద్, గ్రామస్తులు, రఫియా బేగం కుటుంబ సభ్యులు, బంధువులు పాల్గొన్నారు.



# గంజాయి అక్రమ రవాణా.. ముగ్గురు నిందితుల అరెస్ట్

**- రూ.5 లక్షల విలువైన ఎండు గంజాయి, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం**




**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో అక్టోబర్ 17:** గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ..5 లక్షల విలువచేసే ఎండు గంజాయిని, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు కేసముద్రం సీఐ తెలిపారు. కేసముద్రం పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన సమావేశంలో సిఐ వివరాలు తెలియజేస్తూశనివారం 10:50 గంటలకు కేసముద్రం పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, జ్యోతిరావు పూలే సెంటర్ వద్ద అనుమానాస్పదంగా కనిపించిన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా,వారి వద్ద ఉన్న రెండు బ్యాగులు, ఒక చేతి సంచిలో బ్రౌన్ రంగు టేపుతో ప్యాక్ చేసిన 10.165 కిలోల ఎండు గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.ఒడిశా నుంచి కొనుగోలు చేసి హైదరాబాద్‌లో విక్రయించేందుకు కుట్రపోలీసుల విచారణలో నిందితులు ఒడిశా రాష్ట్రానికి వెళ్లి గంజాయిని కొనుగోలు చేసి, చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి హైదరాబాద్‌లో విక్రయించడం ద్వారా లాభాలు పొందాలని ప్రణాళిక వేసుకున్నట్లు వెల్లడించారు. నిందితుల కుమ్మరి నితిన్, 23 సంవత్సరాలు, హరిజనవాడ, ఓల్డ్ అల్వాల్, హైదరాబాద్. తాండ్ర బాలకృష్ణ, 21 సంవత్సరాలు, ఉప్పరపల్లి గ్రామం, షామీర్పేట మండలం, మేడ్చల్ జిల్లా.జేజల అభినాష్, 21 సంవత్సరాలు, ఉప్పరపల్లి గ్రామం, షామీర్పేట మండలం, మేడ్చల్ జిల్లా.**గంజాయి అక్రమ రవాణాపై కఠిన చర్యలు** గంజాయి వంటి మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం, వినియోగం చట్టరీత్యా నేరమని పోలీసులు తెలిపారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, గంజాయి అక్రమ రవాణా లేదా విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిసినవారు పోలీసులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. సమాచారం అందించిన వారికి రూ.5,000 నగదు బహుమతి అందజేసున్నట్లు తెలిపారు. ఈ సమావేశం లో ఎస్సై క్రాంతి కిరణ్, సిబ్బంది తదితరు ఉన్నారు.

# సిరిపురంలో మహాలక్ష్మీదేవి అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారు

**రామన్నపేట, అక్టోబర్ 16 (తొలి అక్షరం):** రామన్నపేట మండలం సిరిపురం గ్రామంలోని శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి దేవాలయంలో దసరా దేవీ శరన్నవరాత్రుల ఏడవ రోజు వేడుకలు ఘనంగా జరిగాయిఏడవ రోజు అమ్మవారు శ్రీ మహాలక్ష్మి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ రోజు పూజా కార్యక్రమాన్ని లిపున్న రామ లక్ష్మయ్య దంపతులు (ధర్మపత్ని సరస్వతి వారి కుమారుడు, సిరిపురం చేనేత సహకార సంఘం కోశాధికారి లిపున్న అమరేందర్ నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిరిపురం శ్రీ పార్వతీ పరమేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ లిరాపోలు రమేష్ దాసిరెడ్డి వెంకటరమణ, అప్పం గోయల్, మాజీ వార్డు మెంబర్ పున్న వెంకటేశం, దేవాలయ ప్రధాన అర్చకులు జెల్లా అంజయ్య గోపాలచార్యులు, అప్పం రాములు శాస్త్రి, చిన్నోజు సత్యనారాయణ, ఉపేంద్రచారి, సింగం వినయ్ కుమార్, జెల్లా సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.




# శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు



**తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 17:** ఇంద్రపాలనగరం మైసమ్మ కాలనీలో శ్రీశ్రీశ్రీ మైసమ్మ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 14వ వార్షికోత్సవ శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఈరోజు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మైసమ్మ కాలనీ గ్రౌండ్‌లో భక్తులకు, కాలనీ ప్రజలకు ఉపయోగపడే విధంగా హైమాస్ట్ లైట్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చిన చిన్నపాక పద్మావతి శ్రీనివాస్ కి శ్రీ దుర్గామాత కమిటీ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము. అమ్మవారి ఆశీస్సులతో పద్మావతి శ్రీనివాస్ కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు

# మహనీయుల జ్ఞాన సారథి మేడి నరసింహ మహారాజ్ వర్ధంతి ఘనంగా నిర్వహణ



**తొలి అక్షరం/రామన్నపేట, అక్టోబర్ 16:** యాదాద్రి-భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, భోగారం గ్రామంలో మహనీయుల జ్ఞాన సారథి, నర'సింహ' మహారాజ్ అని పిలువబడే లిమేడి నరసింహ సార్ వర్ధంతిలిని మాదిగ జాగృతి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భోగారంలో నివాళులు: భోగారం గ్రామంలో ఉన్న మేడి నరసింహ మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లు అర్పించారు. ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షులు లిబందెల అశోక్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర నాయకులు లినల్ల నరేందర్ మాట్లాడుతూ... మేడి నరసింహ సార్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా కొనసాగుతూనే మహనీయులు జ్యోతిరావు పూలే, డా. బి. ఆర్. అంబేద్కర్, కాన్షీరాం ఆలోచనలను, ఆశయాలను కొనసాగిస్తూ ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా ఉద్యమాన్ని నిర్మించారన్నారు. అనేక మంది యువకులను చైతన్యం చేసిన గొప్ప దార్శనికుడు మన నరసింహ మహారాజ్ ని కొనియాడారు. ఆయన ద్వారా చైతన్యం పొందిన యువకులు తెలంగాణ రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో అసెంబ్లీ, పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి గౌరవప్రదమైన ఓట్లు సాధించారని తెలిపారు. డా. అంబేద్కర్ కోరుకున్న రాజ్య స్థాపన కోసం డా. విశారదన్ మహారాజ్ స్థాపించిన లిడీఎస్పీ ఉద్యమంలో జిల్లా అధ్యక్షులుగా మేడి నరసింహ పనిచేశారని గుర్తు చేశారు. కొనసాగిస్తాం: మాదిగ జాగృతి జిల్లా అధ్యక్షులు శాంతి కుమార్ మాట్లాడుతూ... మేడి నరసింహ మహారాజ్ ఆలోచనా విధానాన్ని, ఆశయాలను ముందుకు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాదిగ జాగృతి సంఘం నాయకులు అశోక్, మల్లేష్, గోవర్ధన్, ఆంజనేయులు, స్వామి, నరేందర్, సమగ్న, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



# రామన్నపేట మండల ప్రజలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

**- గర్దాస్ విక్రమ్ సర్పంచ్ ఇంద్రపాలనగరం**

**తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 17:** రామన్నపేట మండల ప్రజలకు ఇంద్రపాలనగరం గ్రామ ప్రజలకు అధికారులకు ప్రజాప్రతినిధులకు నా ఇంటి ఆడపడుచులకు సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు.

# బాక్సింగ్ క్రీడాకారిణి భవ్య తేజనికి కేకే కృష్ణ చేయూత

- భవ్య తేజనికి బాక్సింగ్ కిట్ అందజేసిన కేకే కృష్ణ
- గ్రామీణ క్రీడాకారిణికి ప్రోత్సాహం.. భవ్య తేజనికి కేకే కృష్ణ అండ



**తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 17:** గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా కేకే ఫౌండేషన్ సేవలు కొనసాగుతున్నాయని కాంగ్రెస్ యువ నాయకుడు, షాద్‌నగర్ నియోజకవర్గానికి చెందిన పారిశ్రామికవేత్త కేకే కృష్ణ అన్నారు. కొందుర్గ్ మండల కేంద్రానికి చెందిన యువ బాక్సింగ్ క్రీడాకారిణి జిల్లెళ్ల భవ్య తేజనికి ఆయన బాక్సింగ్ కిట్‌ను బహూకరించారు. చిన్న వయసులోనే పట్టుదల, ఆత్మవిశ్వాసంతో బాక్సింగ్‌లో రాణిస్తూ పలు విజయాలు సాధించిన భవ్య తేజని, త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా కేకే కృష్ణ ఆమెకు క్రీడా సామగ్రిని అందించి, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులకు అవసరమైన సహకారం అందించేందుకు కేకే ఫౌండేషన్ కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భవ్య తేజని తల్లిదండ్రులు డాక్టర్ జంగయ్య, పరిమళ రాణి, ఆమె సోదరి, కుటుంబ సభ్యులు పాల్గొని కేకే కృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

# పార్టీలకతీతంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు

**- షాద్‌నగర్‌లో ఈ నెల 22న నిర్వహణ**





**తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 17:** పండుగ సాయన్న జయంతి వేడుకలను ఈ నెల 22న షాద్‌నగర్‌లో ఘనంగా నిర్వహించేందుకు తాలూకా ముదిరాజ్ సంఘం ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా కేశంపేట, నందిగామ, కొత్తూరు మండలాల్లోని నాయకులకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే అంజన్న, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సహా వివిధ పార్టీల నాయకులను వేడుకలకు ఆహ్వానించారు. నియోజకవర్గవ్యాప్తంగా సుమారు నాలుగు వేల మందితో జనసమీకరణకు ప్రణాళిక రూపొందించినట్లు సంఘం నాయకులు తెలిపారు. పండుగ సాయన్న ధైర్యసాహసాలను నేటి తరానికి తెలియజేయడంతోపాటు సామాజిక ఐక్యతను చాటడమే లక్ష్యమన్నారు. అన్ని పార్టీల నాయకులు, ముదిరాజ్ సంఘం సభ్యులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

# షాద్‌నగర్ ప్రీమియర్ లీగ్ విజేతలకు బహుమతుల ప్రదానం

**- యువత క్రీడల్లో రాణించాలి: మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్**



**తొలి అక్షరం/షాద్ నగర్,అక్టోబర్ 17:** షాద్‌నగర్ పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన షాద్‌నగర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ ఆక్షన్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగింది. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధించిన క్రీడాకారులకు మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్ బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడలు యువతలో క్రమశిక్షణ, పట్టుదల, ఐకమత్యం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించి పట్టణానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. షాద్‌నగర్ ప్రీమియర్ లీగ్ వంటి టోర్నమెంట్లు స్థానిక క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు దోహదపడతాయని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని క్రీడా పోటీలు నిర్వహించి యువతను ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ ముదిరాజ్, కౌన్సిలర్ సి. పెంటయ్య, మురళీమోహన్, అప్పి, కొప్పునూరి ప్రవీణ్, సాదిక్, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ నిమజ్జనం సజావుగా సాగేలా సమన్వయంతో పనిచేయాలి

**- అధికారులకు ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళి నాయక్ సూచన**





**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో, అక్టోబర్ 17:** సద్దుల బతుకమ్మ నిమజ్జనం సజావుగా జరిగేలా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మహబూబాబాద్ శాసనసభ్యుడు డాక్టర్ భూక్యా మురళి నాయక్ సూచించారు. పట్టణంలో జరగనున్న సద్దుల బతుకమ్మ వేడుకలను పురస్కరించుకుని నిజాం చెరువు, ఎన్టీఆర్ స్టేడియంలో చేపడుతున్న ఏర్పాట్లను మున్సిపల్ చైర్‌పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్ నాయక్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బతుకమ్మ వేడుకలకు వచ్చే మహిళలు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు తగిన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. చెరువుల వద్ద బతుకమ్మలను నిమజ్జనం చేసే సమయంలో పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, పరిసర ప్రాంతాల్లో తగినన్ని వీధి దీపాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. మహిళలు బతుకమ్మ ఆడే ప్రాంగణాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రజలందరూ ఆనందోత్సాహాలతో, భక్తిశ్రద్ధలతో జరుపుకునేలా ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సుర్నపు సోమయ్య, స్థానిక వార్డు కౌన్సిలర్ కాటా భాస్కర్, డీఈ ఉపేందర్, సీఐ రఘుపతిరెడ్డి, ఎస్ఐ ఉమా, చిట్యాల జనార్దన్, పద్మం ప్రవీణ్, బొల్లు రాజు, నీరుటి లక్ష్మీనారాయణ, ఎడ్ల రమేష్, హరిసింగ్ నాయక్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# షాద్‌నగర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం.. కారు డ్రైవర్ మృతి

**బైక్‌ను ఢీకొట్టి డివైడర్‌పైకి దూసుకెళ్లిన కారు.. యువకుడికి గాయాలు**





**తొలి అక్షరం/షాద్‌నగర్, అక్టోబర్ 17:** షాద్‌నగర్ పట్టణంలోని పరిగి రోడ్డులో శనివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శ్రీ విష్ణు గ్రానైట్స్ కంపెనీ సమీపంలో బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టిన కారు, అదుపుతప్పి రోడ్డు మధ్యలోని డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో కారు డ్రైవర్ మృతి చెందగా, ద్విచక్ర వాహనదారుడు గాయపడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం.. షాబాద్ మండలం కాకులూరు గ్రామానికి చెందిన చాకలి వసంత్‌కుమార్ (29) డీజే ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం ఉదయం 8.30 గంటల సమయంలో బైక్‌పై కాకులూరు నుంచి షాద్‌నగర్ వైపు వెళ్తుండగా, టీఎస్ 07 హెచ్‌జెడ్ 433 నంబరు గల కియా కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వసంత్‌కుమార్‌కు తల, నడుము, ఎడమ కాలికి గాయాలయ్యాయి. కారు డివైడర్‌ను ఢీకొనడంతో డ్రైవర్ చిన్న వెంకటయ్య (43) మృతి చెందాడు. ఆయన షాబాద్ మండలం మొరంపల్లి గ్రామానికి చెందిన లక్ష్మయ్య కుమారుడు. గాయపడిన వసంత్‌కుమార్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఇదే కారు అంతకుముందు కుర్వగూడ గ్రామ సమీపంలో ఏపీ 28 డీఎస్ 4729 నంబరు గల మరో ద్విచక్ర వాహనాన్ని కూడా వెనుక నుంచి ఢీకొట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై షాద్‌నగర్ పోలీసులు క్రైమ్ నంబర్ 918/2026తో బీఎన్ఎస్ సెక్షన్లు 125(ఎ), 106(1) కింద కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఆర్. శ్రీకాంత్ నాయక్ దర్యాప్తు చేస్తున్నారు. వాహనదారులు అతివేగాన్ని నివారించి, రహదారి భద్రతా నియమాలు పాటించాలని పోలీసులు సూచించారు.

# ట్రై సిటీస్ హాఫ్ మారథాన్ 2026లో పాల్గొన్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు...






**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రం గ్రౌండ్స్ వేదికగా నిర్వహించిన 'ట్రై సిటీస్ హాఫ్ మారథాన్ 2026' (ఎడిషన్02) కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి లతో కలిసి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. యువతలో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం, శారీరక దృఢత్వం, క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని ప్రోత్సహించడం లక్ష్యంగా నిర్వహించిన ఈ మారథాన్‌లో యువత పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో భాగంగా 21కే హాఫ్ మారథాన్, 10కే టైమ్డ్ రన్, 5కే ఫన్ రన్ నిర్వహించారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధించిన రన్నర్లకు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి మెడల్స్ అందజేసి అభినందించారు. క్రీడలు, పరుగు పోటీలు యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలికి దోహదపడతాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని, ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ సమాజంలో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. మారథాన్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ అభినందిస్తూ, విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విష్ణువర్ధన్ రెడ్డి, వరంగల్ మున్సిపల్ కమిషనర్ వెంకన్న, డీసీపీ ధార కవిత, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి ఫైనల్స్‌కు 'రాకెట్ రుద్రమ-2'

**విద్యార్థుల బృందానికి రూ.2 లక్షల ఆర్థిక సాయం**

**మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా చెక్కు అందజేత**




**తొలి అక్షరం/హనుమకొండ ప్రతినిధి:** జాతీయ స్థాయి మోడల్ రాకెట్రీ పోటీల ఫైనల్స్‌కు వరంగల్ ఎన్ఐటీ విద్యార్థులు రూపొందించిన 'రాకెట్ రుద్రమ-2' ఎంపికైంది. ఈ నేపథ్యంలో రాకెట్ తుది తయారీ, ప్రయోగ ఖర్చుల కోసం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని రూ.2 లక్షల ఆర్థిక సాయం అందించారు. హనుమకొండలో నిర్వహించిన 'ట్రై సిటీస్ హాఫ్ మారథాన్2026, ఎడిషన్2' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి రామకృష్ణ కాలనీలోని తన నివాసానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి చేతుల మీదుగా ఎన్ఐటీ వరంగల్ విద్యార్థి పింగిళి రాజశేఖర్‌రెడ్డి నేతృత్వంలోని బృందానికి రూ.2 లక్షల చెక్కును అందజేశారు. డల్లాస్‌కు చెందిన ఈ4జెడ్ టెక్నాలజీస్ సంస్థ అధినేత శరత్‌రెడ్డి సౌజన్యంతో ఈ ఆర్థిక సాయం అందించారు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో), ఇన్-స్పేస్ సంయుక్తంగా ఉత్తరప్రదేశ్‌లో నిర్వహిస్తున్న 'ఇన్-స్పేస్ మోడల్ రాకెట్రీ ఇండియా స్టూడెంట్ కాంపిటీషన్'లో 'రాకెట్ రుద్రమ-2' కీలకమైన నమూనా రూపకల్పన సమీక్ష అర్హత సాధించి జాతీయ స్థాయి ఫైనల్స్‌కు చేరుకుంది. గతంలో ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా ఉన్న సమయంలో ఆయన చొరవతో 'రాకెట్ రుద్రమ-1' ప్రయోగం విజయవం తమైంది. విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాన్ని ప్రోత్స హిస్తూ, అంతరిక్ష రంగంలో ప్రతిభ చూపుతున్న ఎన్ఐటీ విద్యార్థుల బృందానికి అండగా నిలిచిన ఇనగాల వెంకట్రామ్‌రెడ్డిని మంత్రి శ్రీధర్‌బాబు అభినం దించారు. రాబోయే జాతీయ స్థాయి పోటీల్లో 'రాకెట్ రుద్రమ-2' విజయం సాధించాలని ఆకాంక్షించారు.

# కీసర పోలీస్ స్టేషన్ నూతన ఎస్హెచ్ఓ సిఐగా ఎన్.ఎలక్షన్ రెడ్డి బాధ్యతల స్వీకరణ

- శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా కఠిన చర్యలు
- ఎస్హెచ్ఓ సిఐ ఎన్.ఎలక్షన్ రెడ్డి




**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),అక్టోబర్17:** మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అత్యంత వ్యూహాత్మక, కీలకమైన కీసర పోలీస్ స్టేషన్ నూతన స్టేషన్ హౌస్ ఆఫీసర్గా సిఐ ఎన్.ఎలక్షన్ రెడ్డి అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు.నిబద్ధతకు, కఠిన నిర్ణయాలకు మారుపేరైన ఆయన నియామకంపై స్థానికంగా పోలీసు వర్గాల్లో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సిఐ ఎలక్షన్ రెడ్డి మాట్లాడుతూ...కీసర ప్రాంతంలో శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. చట్టాన్ని అతిక్రమించే వారిపై, అసాధారణ కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. ప్రజలకు, పోలీసు శాఖకు మధ్య సత్సంబంధాలు పెంపొందిస్తూ, ప్రజా స్నేహపూర్వక పాలన అందించడమే తన ప్రథమ ప్రాధాన్యత అని తేల్చిచెప్పారు. నేరాల కట్టడి,భూ ఆక్రమణలు, అసాంఘిక కార్యకలాపాలు, రౌడీషీటర్లపై నిరంతరం నిఘా ఉంచుతామని ఆయన స్పష్టం చేశారు. సామాన్యులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ...బాధితులకు తక్షణ న్యాయం జరిగేలా చూస్తామని సిఐ ధైర్యం చెప్పారు.నూతన ఎస్హెచ్ఓగా బాధ్యతలు చేపట్టిన ఎన్.ఎలక్షన్ రెడ్డినీ పలువురు పోలీసు అధికారులు,స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు ఘనంగా అభినందనలు తెలిపారు.

# దొంగల పట్ల అప్రమత్తంగా ఉండండి

- ఇళ్ల భద్రత మన బాధ్యత
- పర్వతగిరి సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ) ఆర్.సంతోష్







**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు), అక్టోబర్17:** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పర్వతగిరి మండలంలో ప్రజలు ఎవరూ కూడా అప్రమత్తత కోల్పోవద్దని, ఇళ్ల భద్రతపై ప్రతి ఒక్కరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని పర్వతగిరి సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ) ఆర్.సంతోష్ హెచ్చరించారు. ఈ సందర్భంగా సీఐ సంతోష్ మాట్లాడుతూ..రాత్రి సమయాల్లోనే కాకుండా పగటిపూట కూడా ఇళ్ల భద్రతపై ప్రజలు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఇంటి నుంచి ఎక్కడికైనా వెళ్లేటప్పుడు ప్రధాన ద్వారాలు,కిటికీలకు పటిష్టమైన తాళాలు వేయాలని, సీసీ కెమెరాలు లేదా సెక్యూరిటీ అలారాలు ఏర్పాటు చేసుకోవడం మంచిదని తెలిపారు.ఇళ్లలోకి ప్రవేశించే మార్గాల్లో బలమైన తాళాలను ఉపయోగించాలని ఆయన పేర్కొన్నారు. ప్రజలు కొన్ని రోజుల పాటు ఊళ్లో లేకపోతే,ఆ సమాచారాన్ని ఇరుగుపొరుగు వారికి లేదా స్థానిక పోలీసులకు తెలపాలని సూచించారు. ముఖ్యంగా ఇంట్లో బంగారు,వెండి ఆభరణాలు లేదా నగదు బయటకు కనిపించేలా ఉంచవద్దని ఆయన హెచ్చరించారు.కాలనీల్లో లేదా పరిసర ప్రాంతాలలో ఎవరైనా కొత్త వ్యక్తులు లేదా అనుమానాస్పదంగా సంచరిస్తే వెంటనే అప్రమత్తమై పోలీసులకు సమాచారం ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఎలాంటి అసాధారణ ఘటనలు లేదా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే ప్రజలు ఎలాంటి భయం లేకుండా తక్షణమే 100/112 నంబర్కు డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని పర్వతగిరి సీఐ సంతోష్ కోరారు.

# అమర పోలీసుల స్ఫూర్తితో.. 157 మంది రక్తదానం

- గ్రేహౌండ్స్ ప్రధాన కార్యాలయంలో రక్తదాన శిబిరం




**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),అక్టోబర్17:** పోలీసు స్మారక వారోత్సవాల సందర్భంగా గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగాలకు చెందిన 157 మంది పోలీసు సిబ్బంది రక్తదానం చేశారు. హైదరాబాద్లోని గ్రేహౌండ్స్ ప్రధాన కార్యాలయంలో శని వారం నిర్వహించిన ఈ రక్త దాన శిబిరంలో కమాండోలు, సీనియర్ అధికారులు, ప్రొబేషనరీ డీఎస్పీలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు.ప్రజాసేవతో పాటు ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడటంలోనూ ముందుంటామని పోలీసులు ఈ కార్యక్రమం ద్వారా చాటిచెప్పారు. గ్రేహౌండ్స్లో మూడు వారాల పాటు జంగిల్ ఆపరేషన్స్ అండ్ సర్వైవల్ టాక్టిక్స్ లో శిక్షణ పొందుతున్న 30 మంది ప్రొబేషనరీ డీఎస్పీలు సైతం రక్తదానం చేశారు.తెలంగాణ గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగాల డీజీపీ (ఆపరేషన్స్) డాక్టర్ అనిల్కుమార్ (ఐపీఎస్) కార్యక్రమంలో పాల్గొన్నారు. రక్తదాతలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్లు ఎం.డి. అష్ఫాక్, ఎ. వెంకటేశ్వర్లు, పి.వి. నారాయణస్వామి, స్క్వాడ్రన్ కమాండర్లు బి. శంకరయ్య, జి. రాజు, ఆక్టోపస్ అదనపు ఎస్పీ సి.హెచ్. రఘునందన్రావు, గ్రేహౌండ్స్ వైద్యాధికారులు డాక్టర్ ఎం. శ్రీనివాస్రెడ్డి, డాక్టర్ పి. మంజురెడ్డి, ఆక్టోపస్ వైద్యాధికారి డాక్టర్ పి. శ్రీనివాస్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఇండియన్ రెడ్క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర శాఖ సహకారంతో శిబిరాన్ని నిర్వహించారు.

# మత్తుపై ఉక్కుపాదం.. డ్రగ్స్ రహిత భారతే లక్ష్యం

- 2029 నాటికి నశా ముక్త్ భారత్
- దేశవ్యాప్త మోటార్సైకిల్ ర్యాలీని ప్రారంభించిన తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్
- అక్టోబరు 31న గుజరాత్లోని కేవడియాకు చేరుకోనున్న బైకర్లు









**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),అక్టోబర్17:** డ్రగ్స్ మహమ్మారిని దేశం నుంచి తరిమికొట్టి, యువత ఉజ్వల భవిష్యత్తును కాపాడటమే ప్రధాన లక్ష్యంగా దేశవ్యాప్తంగా మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. శనివారం బంజారాహిల్స్లోని సమన్వయ కమాండ్ కంట్రోల్ సెంటర్ వద్ద ఆయన జెండా ఊపి ఈ భారీ ర్యాలీని పచ్చజెండా ఊపి ప్రారంభించారు. సర్దార్ వల్లభ్భాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని నిర్వహిస్తున్న రాష్ట్రీయ ఏక్తా దివాస్ (జాతీయ ఐక్యతా దినోత్సవం) సందర్భంగా సీఆర్పీఎఫ్ నోడల్ ఏజెన్సీగా సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టింది.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పుదుచ్చేరి, అండమాన్ నికోబార్ దీవులకు చెందిన బైక్ రైడర్లు ఇందులో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల సరఫరా,వినియోగంపై రాజీలేని పోరాటం చేస్తామని ఉద్ఘాటించారు. డ్రగ్స్ బారినపడి దేశ భవిష్యత్తు అయిన యువత తమ జీవితాలను నాశనం చేసుకోవడం అత్యంత విచారకరం.దేశాన్ని పూర్తిస్థాయిలో మాదకద్రవ్య రహితంగా మార్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కంకణబద్ధులై ఉన్నాయ అని పేర్కొన్నారు.తెలంగాణలో ఈగల్ ఫోర్స్, పోలీసు శాఖ సమన్వయంతో డ్రగ్స్ అక్రమ రవాణా,విక్రయ ముఠాల నడుము విరిచేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. భిన్న భాషలు, సంస్కృతులు ఉన్నప్పటికీ జాతీయ సమైక్యతే భారతీయ ఆత్మ అని డీజీపీ వ్యాఖ్యానించారు.ఐక్యత,సామాజిక బాధ్యతను చాటిచెబుతూ డ్రగ్స్ దుష్ప్రభావాలపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ఈ పోరాట ర్యాలీ దోహదపడుతుందన్నారు. 2029 డిసెంబర్ నాటికి పూర్తిస్థాయిలో నశా ముక్త్ భారత్ సాధనకు ప్రతి ఒక్కరూ చేయి చేయి కలపాలని పిలుపునిచ్చారు. ర్యాలీలో పాల్గొంటున్న తెలంగాణ పోలీస్ సిబ్బంది సహా రైడర్లందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని ఆకాంక్షించారు.ఈ బైక్ రైడర్లు వివిధ రాష్ట్రాల మీదుగా ప్రయాణించి, అక్టోబరు 30 నాటికి గుజరాత్లోని కేవడియా (స్టాట్యూ ఆఫ్ యూనిటీ)కు చేరుకుంటారు. అక్టోబరు 31న నిర్వహించే జాతీయ ఐక్యతా దినోత్సవ వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నారు. ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారి విక్రమ్, నార్కటిక్స్ కంట్రోల్ బ్యూరో అసిస్టెంట్ డైరెక్టర్ విశాల్తో పాటు పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది, ఎన్సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

# వంగపహడ్ పీఏసీఎస్ చైర్మన్గా అనిల్ రెడ్డి నియామకం...

- శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు...



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** గ్రేటర్ వరంగల్ 2వ డివిజన్ పరిధిలోని వంగపహడ్ పీఏసీఎస్ (ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం) చైర్మన్గా అనిల్ రెడ్డి నియమితులైన సందర్భంగా వర్ధన్నపేట నియోజకవర్గ శాసనసభ్యులు,విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ను హనుమకొండలోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా అనిల్ రెడ్డి తో పాటు పీఏసీఎస్ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే ను కలిసి తమ సంతోషాన్ని పంచుకున్నారు.నూతనంగా చైర్మన్గా నియమితులైన అనిల్ రెడ్డి తో పాటు కమిటీ సభ్యులను ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు శాలువాతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ రైతుల సంక్షేమానికి,సహకార సంఘం అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.అనంతరం పీఏసీఎస్ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ను శాలువాలతో సత్కరించి తమ అభివానం, గౌరవాన్ని చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో 2వ డివిజన్ అధ్యక్షులు పుట్ట తిరుపతి,డివిజన్ ఉప అధ్యక్షులు రవీందర్, మాజీ చైర్మెన్ మెరుగు రాజేష్ గౌడ్,గ్రామశాఖ అధ్యక్షులు రాజు,పీఏసీఎస్ కమిటీ సభ్యులు గండు అశోక్,ఎంజాపురి రాములు,కొండ రాజు,సముద్రాల నర్సయ్య నారాయణ, కోరె సరోజన,మేరగుట్టి సూరయ్య,మేరుగు రాధిక,పొన్నాల రాధ,పోలాది రామ్ రెడ్డి,కన్నెబోయిన రాజు,బండి శంకరయ్య,రేమిడి సాంబ రెడ్డి,డివిజన్ ముఖ్య నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయమే లక్ష్యం

- నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 17:** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డిని గెలిపించడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని షాద్నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. శనివారం మహబూబ్నగర్లోని బృందావన్ గార్డెన్స్లో నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. చరిత్రలోనే తొలిసారిగా ఇంత ముందుగా ఎమ్మెల్సీ అభ్యర్థిని ప్రకటించామని తెలిపారు. పార్టీ వ్యూహాన్ని అర్థం చేసుకుని నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేయాలన్నారు. పట్టభద్రులు తమ ఓటు హక్కును నమోదు చేసుకునేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పులను ప్రస్తుత ప్రభుత్వంపై రుద్దడం సరికాదన్నారు. సమావేశంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎంపీ మల్లు రవి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ధార్మిక కార్యక్రమాలు సంప్రదాయాలకు ప్రతీకలు

- దూసకల్లో చండీ హోమం.. పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్





**తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 17:** గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ధార్మిక కార్యక్రమాలు సంప్రదాయాలు, భక్తిభావానికి ప్రతీకలని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. మండల పరిధిలోని దూసకల్ గ్రామంలో శ్రీ దుర్గామాత సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శర న్నవరాత్రి ఉత్స వాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం అమ్మవారి మండపంలో నిర్వహించిన చండీ హోమంలో అంజయ్య యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించు కున్నారు. వేద మంత్రోచ్ఛారణల మధ్య హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇలాంటి కార్యక్రమాలు భావితరాలకు మన సంస్కృతి, సంప్రదాయాలను అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ లావణ్య దేవేందర్ యాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్, మాజీ సర్పంచ్ మురళీధర్ రెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, రవి యాదవ్, భాగం కుమార్, కావలి అశోక్, శివకుమార్, బాలు, రవి నాయక్, కిట్టు, విష్ణు, శ్రీను, మల్లేష్, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

Editor pastham Saidulu,R.R. GRAPHICS, H.No. 1-8-747/11/45, Street No. 27, Near Sundaraiah Park, Nallakunta, Hyderabad